నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 16 జనవరి 2025 | ADILABAD NIRMAL


## గ్రామ, వార్డు సభల నిర్వహణకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొ త్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి గ్రామాలు, వార్డుల్లో గ్రామసభలు పక్కాగా నిర్వ హించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గణ తంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి పైపథకా లను అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో చేపట్టా ల్సిన చర్యలపై అధికారులతో మంగళవారం కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో అర్హులకు పథకాలు అందేం దుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, పౌర సరఫరాల అధికారులు ఏపీఎంలు, అధికారులతో సమ న్వయ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సందేహాలున్నట్లయితే కలెక్టరేట్ కంట్రోల్ రూం నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాశీ తీర్థయాత్రలో విషాదం

### అగ్నికి ఆహుతైన పల్సివాసి



దురపతి(ఫైల్)

కుభీర్, తానూర్, 15 : మండలంలోని పల్సి గ్రామం నుంచి ఈ నెల 1న తీర్థయాత్రలకు బయలుదేరిన యాత్రికుల బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన్ క్షేత్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్ని ప్రమాదంలో కుభీర్ మండలం లోని పల్సి గ్రామానికి చెందిన శీలం దురపతి(69) అగ్నికి ఆహుతయ్యాడు. ఈ ఘటనలో బస్సుతోపాటు 50 మంది యాత్రికులకు సంబంధించిన సామగ్రి, దుస్తులు, నగదు, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని కాశీయాత్ర పూర్తి చేసుకుని 50 మంది భక్తులతో బృందావన్‌కు వచ్చారు. 49 మంది భక్తులు బృందావన్ దర్శనానికి వెళ్లగా దురపతి అనారోగ్యంతో బృందావన్ దర్శనానికి వెళ్లకుండా బస్సులోనే ఉండిపోయాడు. ఇదే సమయంలో బస్సుకు అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో బస్సులోనే ఉన్న దురపతి సజీవ దహనం అయ్యాడు. మంటల తీవ్రతకు బస్సుతోపాటు ప్రయాణికుల వస్తువులు, సామగ్రి నగదుతోపాటు ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. మంటలను ఫైర్ సిబ్బంది ఆర్పివేసే చర్యలు చేపట్టినప్పటికీ నష్టం జరిగిపోయింది. దురపతికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, రైతులు

# గర్జించిన బీఆర్ఎస్

**రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా అమలు చేయాలని ధర్నా**

- రామన్న ఆధ్వర్యంలో బేల అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయింపు
- ఇరువైపులా గంటల తరబడి నిలిచిన వాహనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- మండలంలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం
- అక్రమ అరెస్టులకు భయపడం : మాజీ మంత్రి

బేల, జనవరి 15 : బీఆర్ఎస్ నాయకులు గర్జించారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బేల మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకున్నది. ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతు బంధు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు సమస్యలపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిమ్మకు నీరెత్తినట్టు కాంగ్రెస్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. రైతుల పక్షాన ఉండాల్సిన స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వంపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, స్వరూపరాణి, కరుణ, ప్రమోద్‌రెడ్డి, టాక్రె గంభీర్, సతీశ్ పవర్, జక్కుల మధూకర్, దేవన్న, కిషన్ వైద్య, రామ్ చందర్, జితేందర్, తన్వేర్ ఖాన్, విప్పిన్ కోడె, సంతోష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మాజీ మంత్రిని ఈడ్చుకోపోతున్న పోలీసులు

# రైతు భరోసాపై ఆశలు



**రూ.2 లక్షల రుణమాఫీలా జరగవద్దంటున్న రైతులు**

- నేటి నుంచి క్షేత్రస్థాయి పరిశీలన
- ఈనెల 26 నుంచి అమలుకు చర్యలు

ఆదిలాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రకటించిన రైతుభరోసా పథకం సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రైతు భరోసాలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత మాట మార్చి ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. రైతులకు పెట్టుబడి సాయాన్ని ఈ నెల 26 నుంచి అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను గుర్తించడానికి అధికారులు నేటి( గురువారం) నుంచి గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈనెల 20 వరకు భూముల గుర్తింపు ప్రక్రియ నిర్వహించనుండగా.. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు ఏర్పాటు చేసి అన ర్హుల జాబితాను ప్రదర్శిస్తారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. భూ భారతి(ధరణి) పోర్టల్‌లో నమోదై ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు ఏడాదికి రూ.12 వేలు అందించనున్నారు. ఇండ్లు, కాలనీలుగా మారిన భూములు, లే అవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్ర మలు, గోదాములు, మైనింగ్‌కు ఉపయోగించేవి, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనుగుణంగా లేని భూము లకు రైతు భరోసా వర్తించదు.

### గుర్తింపు ప్రక్రియ

వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను గుర్తించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ శాఖ ఏఈవోలు ఈ ప్రక్రియకు టీం లీడ ర్లుగా వ్యవహరిస్తారు. ఆదిలాబాద్ జిల్లాలో 509 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. గ్రామాలవారీగా భూముల గుర్తింపు ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రతి గ్రామ పట్టాదారు పాసు పుస్తకాల జాబితా తోపాటు విలేజ్, గూగుల్ మ్యాప్ సహాయంతో గ్రామాల్లో పర్యటించి భూములను పరిశీలి స్తారు. అనంతరం మండల తహసీల్దార్, వ్యవసాయశాఖ అధి కారులు గ్రామాల్లోని సర్వే నంబర్లను పరిశీలించి సాగులో లేని భూములను నిర్ధారిస్తారు. ఇలా గుర్తించిన వాటిని గ్రామసభలో వినిపించి ఆమోదం తీసుకుంటారు. వ్యవసాయంలో లేని భూముల జాబితాను పోర్టల్‌లో నమోదు చేసి డిజిటల్ సంత కంతో తొలిగిస్తారు.

**రైతుభరోసా వర్తించనివి..**

ఇండ్లు, కాలనీలుగా మారిన భూములు, లే అవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములు, మైనింగ్‌కు ఉపయోగించేవి, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనుగుణంగా లేని భూములు.

### అర్హులకు అందేనా?

రైతు భరోసా పథకం విషయంలో రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం రూ.2 లక్షల రుణమాఫీ మాదిరి కాకుండా సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎన్ని ఎకరాలున్నా అందించాలని కోరుతున్నారు. జిల్లాలో రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులు దాదాపు 30 వేల వరకు ఉంటారు. జిల్లాలో 509 రెవెన్యూ గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులు 1.63 లక్షలు ఉండగా.. 5.78 లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున ప్రతి సీజన్‌లో రూ.280 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథ కంలో భాగంగా మొదట ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని మాట తప్పి ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామంటుందని, నామ్‌కే వాస్తేగా కాకుండా అర్హులైన రైతులందరికీ ఈ సాయం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# ఇచ్చోడను మోడల్‌గా తీర్చిదిద్దుతా..

ఇచ్చోడ, జనవరి 15 : ఇచ్చోడ మండలాన్ని మోడల్ మండ లంగా తీర్చిదిద్దుతామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అ న్నారు. బుధవారం మండల కేంద్రంలోని మదర్సా దారు లుమ్‌లో ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇస్లాంపుర కాలనీలో రూ.15లక్షలతో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మొదటగా మదర్సా పిల్లలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. ఎమ్మెల్యేను కమిటీ స భ్యులు సన్మానించారు. కాలనీలో గ్రావెల్ రోడ్లు వేసి రాను న్న రోజుల్లో సీసీ రోడ్లతోపాటు డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. మదర్సాకు అవసరం ఉన్న కమిటీ సభ్యులు సంప్రదించాల న్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారమే ధ్యేయం

నేరడిగొండ, జనవరి 15 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమ స్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం రేంగన్‌వా డీలో పర్యటించి, రోడ్డు, కల్వర్టు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అభి వృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమైం దన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, తగిన మూల్యం చెల్లిం చుకోక తప్పదని హెచ్చరించారు. గ్రామానికి వెళ్లే గ్రావెల్ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.9.20 లక్షల విలువ గల పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బోందిడి గ్రామంలో యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఫయాజ్, నాయకులు శ్రీకాంత్, రాములు, కైలాస్, అభిరాంరెడ్డి, రాథోడ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలకు స్పందన

### బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహణ



ముగ్గులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, న్యాయ నిర్ణేతలు

ఎదులాపురం, జనవరి 15 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. అంతకుముందు బీఆ ర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న కార్యకర్తలతో పేపర్ పతంగులను ఎగుర వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత, వార్డు కౌన్సిలర్ రామెళ్లి శ్రీలత, మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేశారు. గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.11 వేలు, రెండో బహుమతి రూ.6 వేలు, మూడో బహుమతి రూ.3 వేలతోపాటు మరో ఏడుగురి ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున రూ.7 వేలతో ప్రోత్సాహక బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న మరో 200 మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీశ్, గంద్రత్ రమేశ్, దమ్మ పాల్, కొండ గణేశ్, వెనుగంటి ప్రకాశ్, అశోక్ స్వామి, బట్టు సతీశ్, కడదారపు దేవుదాశ్, పరమేశ్వర్, చెందాల ఈశ్వరి, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, బొడగం మమత, పర్వీన్, కరుణ, నవతే శ్రీనివాస్, ఉగ్గే విఠల్, తదితరులు పాల్గొన్నారు

### ఘనంగా ఉర్సు ఉత్సవాలు

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో గల సాదుల్లాబాబా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం గ్రామం నుంచి సందలు దర్గా వరకు తీసు కొచ్చారు. దారి పొడుగున గుర్రాల నృత్యాలతోపాటు ఫకీ రుల విన్యాసాలు ఆలరించాయి. బ్యాండ్ మేళాలల మధ్య భక్తులు నృత్యాలు చేస్తూ దర్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగరాపు మల్లేశ్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాల్లో జిల్లాతోపాటు చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.

## ఇంద్రాదేవి ఆలయంలో పుష్యమాసం పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 15 : ఇంద్రాదేవి ఆలయంలో పుష్యమా సాన్ని పురస్కరించుకుని ఆదివాసులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఏమాయికుంట పంచాయతీ పరిధిలోని న్యూ హీరాపూర్(రమాయినగర్)కు చెందిన ఆదివాసులు కుటుంబ సమేతంగా ఇం ద్రాదేవి ఆలయానికి తరలివచ్చారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



పూజల కోసం నైవేద్యం వండుతున్న మహిళలు

## ఫోర్జరీ సంతకంతో రూ.5.20 లక్షలు ట్రాన్స్‌ఫర్

ఎదులాపురం, జనవరి 15 : ఫోర్జరీ సంతకంతో రూ.5.20 లక్షలు కాజేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకున్నది. తమకు న్యాయం చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసు కోవాలని బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. జైనథ్ మండలంలోని బహదూర్‌పూర్(ఆనంద్‌పూర్)కు చెందిన తిప్పా రెడ్డి రేఖ ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్‌చౌక్‌లోని బ్యాంక్‌లో గతంలో రూ.5.13 లక్షలను ఫిక్స్ డిపాజిట్ చేసింది. గత డిసెం బర్ 11న గ్రామీణ బ్యాంక్‌కు ఆ డబ్బులు తీసుకోవాలని వెళ్లింది. దీంతో తమ అకౌంట్‌లో ఉన్న రూ.5.20 లక్షలను బడాల సంధ్యారాణి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలి పారు. ఆమె కోడలైన సంధ్యారాణి తండ్రి బడాల విలాస్‌రెడ్డి అదే బ్యాంక్‌కు సంబంధించి రిటైర్డ్ ఉద్యోగి కావడంతో ఈ డబ్బులను సునాయసంగా తన అకౌంట్‌లోకి మార్చుకున్నట్లు బాధితు రాలు పేర్కొంది. తన సంతకం లేకుండానే ఫోర్జరీ చేసి డబ్బులు తీసుకున్న కోడలుతోపాటు ఆమె తండ్రి, బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరింది. తన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విషయమై తెలం గాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్‌ను వివరణ కోరగా, బాధితురాలు ఫిర్యాదు చేయడం జరిగిందని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.



బ్యాంక్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

# ఖాందేవుడిది దశాబ్దాల చరిత్ర

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- మూడు కిలోల నువ్వుల నూనె తాగి దైవభక్తిని చాటిన నాగుబాయి

నార్నూర్, జనవరి 15 : దశాబ్దాల చరిత్ర గల ఖాందేవుడి మహిమ చాలా గొప్పదని ఆసిఫా బాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదిలాబా ద్ జిల్లా నార్నూర్ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ ఖాందే వ్ జాతర మహాపూజతో మంగళశారం వైభ వంగా ప్రారంభమైంది. మంగళవారం పుణ్య క్షేత్రంలో తైలం తాగించే మహోన్నత కార్యక్ర మం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మహారాష్ట్రలోని కేలాపూర్ ఎమ్మె ల్యే తొడసం రాజులు పాల్గొన్నారు. సంప్రదా యంగా స్వాగతం పలికారు. ఆలయ సన్ని ధిలో పూజలు చేశారు. ఆ వంశీయులు ఇంటి వద్ద తయారు చేసిన శుద్ధమైన మూడు కిలోల నువ్వుల నూనెను తాగారు. మెస్రం వంశం ఆడ బిడ్డ, కటోడా ఖాందేవ్ ప్రతిమలకు నైవేద్యం గా సమర్పిస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితీ తాలుకా కొద్దేపూర్ గ్రామానికి చెందిన మెస్రం నాగుబాయి తమ ఇష్టదైవాన్ని తలచి విశ్వశాం తిని కోరుతూ మూడు కిలోల తైలం తాగి దైవ భక్తిని చాటుకున్నది. వారి ఆచారం ప్రకారం మూడేళ్లపాటు తైలంగా తాగి మొక్కును ము గించుకున్నది. ఆడబిడ్డ దంపతులను నూతన వస్త్రాలతో సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినీ దర్బా ర్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. సృష్టి లోని ఏ దేవస్థానంలో ప్రత్యక్షంగా నూనె తాగే ఆచారాన్ని చూడలేదని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ పీఠాధిపతి తొడసం భీంరావ్, కటోడాలు తొడసం బాపురావ్, తొడసం ఆ నంద్‌రావ్, తొడసం రాజుపటేల్, పాండు ప టేల్, ఆదివాసీ జేఏసీ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, రాయి సెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు పటేల్, ఉపాధ్యాయులు మెస్రం శేఖర్‌బాబు, మెస్రం లింగు పాల్గొన్నారు.



నువ్వుల నూనె తాగుతున్న మెస్రం నాగుబాయి



ఆలయంలో పూజలు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 15 : ప్రభుత్వం అమ లు చేస్తున్న పథకాలను అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇంది రమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీ నుంచి ఈ పథకాలను అమలు చేయాలని నిర్ణ యించిందన్నారు. ఆ దిశగా అధికారులు సమ న్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీవో రవీం దర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎంహెచ్‌వో నరేందర్, డీఏవో శ్రీధర్, ఆర్టీవో శ్రీనివాస్, డీపీఆర్‌వో తిరుమల పాల్గొన్నారు.

### వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

ప్రభుత్వం ద్వారా అందించే వైద్యసేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలె క్టర్ రాజర్షి షా అన్నారు. నేషనల్ హెల్త్ మిష న్‌లో భాగంగా అమలు చేసే ఆరోగ్య పథకా లపై ప్రచారం కల్పించేలా బుధవారం జడ్పీ సమావేశ మందిరం నుంచి తెలంగాణ సాంస్కృతిక కళాసారథి అవగాహన బృందా నికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఎన్ ఏహెచ్ఎం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని పీహె చ్‌సీల్లో అమలు చేసే కార్యక్రమాలపై కళా బృందం సభ్యులు వారికి అర్థమయ్యే రీతిలో పాటల రూపంలో తెలియజేస్తారన్నారు. ఆరోగ్య కేంద్రాల ద్వారా అందే సేవలను విని యోగించుకోవాలన్నారు.

## గాలిపటం ఎగురవేస్తూ..

### భవనం పైనుంచి పడి బాలుడి మృతి



షేక్ ఉబేజ్ (ఫైల్)

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 15 : నిర్మల్ పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతానికి చెందిన షేక్ ఉబేజ్(14) మంగళవారం ఇంటి స్లాబ్‌పైన గాలిపటాలను ఎగురవేస్తూ కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా.. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని, పేద కుటుంబానికి చెందిన ఉబేజ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.